సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

● ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌కు చెందిన కాటూరి రమేష్ తోపాటు మరికొంత మంది ఫిలింనగర్‌కు చెందిన నాయకులు మంగళవారం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రం ఉండగా సికింద్రాబాద్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేదన్నారు. ఇప్పుడు ఆ కోటపై మరోసారి పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం గతంలో పనిచేసిన వారికి తిరిగి ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్‌ను గ్రేటర్‌పరిధిలో పటిష్ఠ పరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని చోట్ల విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, శ్యాం నాయుడు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కాటూరి రమేష్ తదితరులు

భూమిపై పెట్టుబడి పేరిట మోసం

● వ్యాపారి కోసం గాలింపు

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూమిపై పెట్టుబడి పేరుతో మోసానికి పాల్పడిన ఓ వ్యాపారి కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌కి చెందిన టి.రఘురాం వైజాగ్‌కి చెందిన శేషంరావు నిరంజన్ అనే వ్యక్తికి 2011లో చేబదులుగా రూ. 37.5 లక్షలు ఇచ్చారు. డబ్బులకు బదులు స్థలం ఇస్తానని నమ్మించాడు. బీటీఎస్ గ్రీన్ ఫీల్డ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీటీఎస్ మైన్స్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ తన్మయి శేషం ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణవేణి గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో తనకు వ్యాపార సంస్థలు ఉన్నాయని నమ్మించాడు. డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో రఘురాం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన కోర్టు అతడికి ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు తీసుకున్న డబ్బులకి రెట్టింపు ఇవ్వాలని ఆదేశించారు. కోర్టు విధించిన షరతులు ఉల్లంఘించడంతో పాటు పరారీలో ఉన్న నిందితుడు నిరంజన్‌ను అరెస్ట్ చేసి తమ ఎదుట హాజరు పరచాలని న్యాయస్థానం ఇటీవల జూబ్లీహిల్స్ పోలీసులను ఆదేశించింది. ఈమేరకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు.

డ్వాక్రా డబ్బుతో ఉడాయించిన సభ్యురాలు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూప్ ద్వారా వచ్చిన లోన్ తీసుకుని తిరిగి కట్టకుండా ఉడాయించిన మహిళపై గ్రూప్ నిర్వాహకురాలు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీనివాస్‌నగర్ వెస్ట్ ప్రాంతంలోని చపర్లాక కరీమ్‌రాణి డ్వాక్రా గ్రూప్ ఎస్ఎల్‌పీగా వ్యవహరిస్తున్నది. ఈ గ్రూప్‌లో పది మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఒక సభ్యురాలైన గౌరీ ఇటీవల తీసుకున్న బ్యాంకు లోన్ రూ. 2 లక్షలు అందరికీ పంచాల్సి ఉండగా పంచకుండా తనే ఉంచుకుంది. ఈ విషయం గురించి అడిగేందుకు గ్రూప్ సభ్యులు ప్రయత్నించగా గౌరీ ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిందని తెలిసింది. దీంతో గ్రూప్ సభ్యులు బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసి వారికి గౌరీ ఫోన్ నెంబరు ఇచ్చారు. కానీ బ్యాంకు వారు ఫోన్ చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో గ్రూప్ నిర్వాహకురాలు కరీమ్‌రాణి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పండ్లు కొనేందుకు వచ్చిన వ్యక్తిపై దాడి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పండ్లు కొనేందుకు బేరమాడుతున్న వ్యక్తిపై పండ్లు అమ్మే యువకుడు నిర్లక్ష్యంగా దాడి చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రాజీవ్‌నగర్ నవశక్తి ప్రహ్లాదప్పాజాలో నివాసముండే కేఎస్ వినయ్‌చంద్ డిమార్ట్‌లో అడ్మినిస్ట్రేటర్. ఈనెల 1వ తేదీ రాత్రి 8 గంటలకు రాజీవ్‌నగర్ రోడ్‌నెం:1లోని పండ్ల దుకాణం వద్దకు వెళ్లి పండ్లు బేరమాడుతున్నాడు. అక్కడ ఉన్న అజమ్ అనే యువకుడు కోపంగా చిరాకుగా మాట్లాడడమే కాకుండా వినయ్ చంద్ మొహంపై పిడిగుద్దులు గుప్పించాడు. అంతే కాకుండా అతడి వీపుపై పొట్టపై దాడి చేశాడు. దీంతో వినయ్ చంద్ స్పృహ కోల్పోయాడు. అక్కడ గుమ్మికూడిన వారంతా సముదాయించి ఆ యుకుడిని క్షమాపణ చెప్పమని కోరినా ఆవేశంతో దుర్భాషలాడాడు. వినయ్‌చంద్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సహజీవనం చేసి.. డబ్బు తీసుకొని మోసం

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు... సహజీవనం చేస్తూ అవసరం ఉందని డబ్బు తీసుకొని ముఖం చాటేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన రుమీ షేక్ బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తూ గాయత్రిహిల్స్‌లో నివాసముంటుంది. ఫేస్‌బుక్ ద్వారా రవికుమార్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. దీంతో ఆమె అంగీకరించింది. ఇద్దరు కలిసి సహజీవనం మొదలు పెట్టారు. ఆర్థిక అవసరాలు ఉన్నాయంటూ నమ్మించి ఆమె నుంచి రూ. 15లక్షలు తీసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకోమని రుమీషేక్ ఒత్తిడి తేగా ముఖం చాటేశాడు. ఆమె ఫోన్‌లకు స్పందించడం లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బండరాయితో కొట్టి వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వెంకటరమణ కాలనీకి చెందిన జె.మునిరాజు(30) సినిమా షూటింగ్‌లకు కార్మికుడిగా పని చేసేవాడు. కొద్ది కాలంగా కుటుంబాన్ని వదిలేసి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 5లోని మెట్రో స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌పై పడుకుంటున్నాడు. శనివారం మద్యం తాగిన మునిరాజు ఫుట్ పాత్‌పై నిద్రించాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు చెంది సినీ పరిశ్రమలో తోటి కార్మికుడిగా పని చేసే వినోద్ ఫుల్‌గా మద్యం తాగొచ్చి తాను పడుకునే స్థలంలో ముని రాజు పడుకొని ఉండడంతో అర్ధరాత్రి గొడవకు దిగాడు. పక్కనే ఉన్న సిమెంట్ రాయితో మునిరాజు తలపై గట్టిగా కొట్టాడు. అక్కడి నుంచి పరారయ్యాడు. మునిరాజు మృతి చెందడంతో జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వినోద్ హత్యకు పాల్పడినట్టు గుర్తించారు. పరారీలో ఉన్న అతడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

వృద్ధుడు మృతి చెందిన ఘటనలో ఒకరు..

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ తీసిన గోతిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటనలో ఫిలింనగర్ పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. షేక్‌పేట మినిగుల్షన్ కాలనీకి చెందిన గులాం మహ్మద్(78) బీహెచ్ఈఎల్ పని చేసి పదవీ విరమణ పొందారు. మార్చి 31న ఇంట్లో నుంచి నమాజ్‌కని ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. టోలిచౌకి క్రాస్ రోడ్డులోని సూర్యనగర్ చేరుకోగానే వాహనం అదుపు తప్పింది. దీంతో గులాం మహ్మద్ అక్కడే డ్రైనేజీ పైప్‌లైన్ కోసం జలమండలి అధికారులు తవ్వి వదిలేసిన గోతిలో పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాంట్రాక్టర్, జలమండలి అధికారులు పనులు నిర్వహించేందుకు గోతి తవ్వి ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే తన తండ్రి మరణించాడని అమీర్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పనులు చేపట్టిన అయ్యప్ప ఇన్ఫ్రా సైట్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు.

ఇద్దరు ట్రాన్స్ జెండర్స్‌కు ఐదు రోజుల జైలు


పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట పరిసర ప్రాంతాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా న్యూసెన్స్ చేస్తున్న ఇద్దరు ట్రాన్స్ జెండర్స్‌కు నాంపల్లిలోని 10వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎం.మురళి మంగళవారం ఐదు రోజుల జైలు శిక్షణ విధించారని పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ తెలిపారు. బేగంపేటకు చెందిన బి.వినయ్ కుమార్(29), ఎండీ షెహనాజ్(22)ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగులు. కొన్ని రోజులుగా పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ న్యూసెన్స్ చేస్తున్నారు. వారిపై ఫిర్యాదు రావడంతో పంజాగుట్ట పోలీసులు ఈ పెట్టి కేసు నమోదు చేసి, నాంపల్లిలోని స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎం.మురళి ఎదుట హాజరు పర్చారు. ఆయన వారికి ఐదు రోజుల జైలు శిక్షణ విధించడంతో వారిని జైలుకు తరలించామని ఇన్‌స్పెక్టర్ శోభన్ తెలిపారు.

ఔటర్‌పై కారు ఢీకొని వ్యక్తి మృతి

జిన్నారం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డుపై కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు బొల్లారం సీఐ గంగాధర్ తెలిపారు. ఈనెల 1న రాత్రి 11గంటల ప్రాంతంలో కాజీపల్లి శివారు ఔటర్ రింగ్ రోడ్డుపై నడుచుకొని వెళ్తున్న షేక్‌ఇషాక్(54)ను కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఖైరతాబాద్ ఏసీ గార్డ్స్‌కు చెందిన వ్యక్తి కాగా, మృతుడి పెద్ద కుమారుడు రుమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

గ్యాస్ లీకై మంటలు..

● బాలుడికి గాయాలు


గాయాలపాలైన బన్నీ

జవహర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో బాలుడికి గాయాలయ్యాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని జ్యోతిరావుకాలనీలో మల్లేశం భార్యా కవిత ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన మల్లేశం కుమారుడు బన్నీ (7) లైట్ స్విచ్ వేశాడు. అప్పటికే ఇంట్లో గ్యాస్ లీకై ఉండటం వల్ల మంటలు చెలరేగి బాలుడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాలుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నగరం మతసామరస్యానికి చిహ్నం

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరం మతసామరస్యానికి చిహ్నం అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. బంజారాహిల్స్‌లోని బంజారా లేక్ వ్యూ ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా షబ్బీర్ అలీ, క్రికెటర్ అజారుద్దీన్, కాంగ్రెస్ సీనియర్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం విజయారెడ్డి ఖర్జూరం ఇచ్చి షబ్బీర్ అలీ తదితరులను ఉపవాస దీక్ష విరమింప జేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ... వంద రోజుల పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మనసు గెలుచుకోగలిగిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ అన్ని సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంటుందని తెలిపారు.


ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి ఖర్జూరం తినిపిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి, చిత్రంలో మహ్మద్ అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్

పరిపూర్ణానంద స్వామికి మద్దతు

పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ కోసం కృషి చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ రాజశ్యామల పీఠం పీఠాధిపతి శివ రాజయోగి కృష్ణ స్వామీజి ప్రకటించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా పరిపూర్ణానంద స్వామికి సీటు దక్కలేదన్న ఆందోళనలో అక్కడి ప్రజలు ఉన్నారని ,తన అసమాన ప్రతిభతో ప్రజలకు హైందవ ధర్మం పట్ల ఆయన చైతన్యాన్ని కలిగిస్తున్నారన్నారు. పరిపూర్ణానంద పూర్తి స్థాయిలో రాజకీయాలకు వస్తే మరింత మేలు జరుగుతుందని అన్నారు. రాజకీయం అంటే సొంత లాభమే అని అనుకుంటున్న తరుణంలో సర్వాన్ని త్యాగం చేసి ప్రజల కోసమే తపించే వారే ప్రస్తుత రాజకీయాలకు అవసరమని అన్నారు. కేవలం సేవా దృక్పథంతోనే రాజకీయాలకు వస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉందని అన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్న పరిపూర్ణానంద గెలుపునకు తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. పరిపూర్ణానంద స్వామి హిందూపురం నుంచి గెలవాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈసమావేశంలో స్వామీజి అనుచరులు మదన్మోహన్‌రెడ్డి, సుధాకర్ రావు, వైద్యనాథ్, చంద్రశేఖర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఠాధిపతి శివ రాజయోగి కృష్ణ స్వామీజి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మొట్టమొదటి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎర్రగడ్డ గౌడ సంఘం అధ్యక్షుడు దూడల రవి గౌడ్ కొనియాడారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని ఎర్రగడ్డ హేమావతినగర్‌లో ఆయన చిత్రపటం వద్ద పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లండన్‌లో ఉన్న కేం బ్రిడ్జి యూనివర్సిటీ పాపన్న మహారాజు చరిత్రపై అధ్యాయం చేయించి పుస్తకాలను ముద్రించిందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ శాశ్వత శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎర్రగడ్డ గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర కృష్ణ కుమార్, రమేష్ నాయక్, మధు గౌడ్, పెగడ ఆకాష్, కాజా పాషా తదితరులు పాల్గొన్నారు.


సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ గౌడ సంఘం అధ్యక్షులు రవి గౌడ్

రోడ్డు రోలర్‌తో 1000 సైలెన్సర్స్ ధ్వంసం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చెవులు చిల్లుమనిపించే కఠోర శబ్దాలతో.. కర్ణబేరి పగిలిపోయేంత ధ్వనులతో రయ్‌మంటూ దూసుకెళ్తాన్న పోకిరీల అరాచకాలకు ముకుతాడు వేస్తున్నారు సిటీ ట్రాఫిక్ పోలీసులు. సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు వింత, విపరీత శబ్దాలతో దూసుకెళ్తున్న వాహనదారులపై కొరడా ఝులిపిస్తున్నారు.


సీజ్ చేసిన సైలెన్సర్స్‌ను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న సిటీ ట్రాఫిక్ పోలీసులు

ప్రత్యేక డ్రైవ్

సిటీలో అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో స్పెష ల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులను పట్టుకున్నారు. మొత్తం 1910 కేసులు నమోదు చేశారు. కొంతమంది వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా భయంకరమైన శబ్దాలతో కూడిన సైలెన్సర్స్‌ను బిగించుకుంటున్నారు. వాటితో సిటీలో రోడ్లపై ఇష్టానుసారంగా తిరుగుతూ తోటి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సిటీ కమిషనరేట్ పరిధిలో పట్టుబడ్డ 1000 వాహనాల సీజ్ చేశారు. వాటి సైలెన్సర్స్ తొలగించారు. సిటీ పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశాలతో, ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు పర్యవేక్షణలో సైలెన్సర్స్‌ను రోడ్డురోలర్‌తో తొక్కించారు.

రాష్ట్రంలో మాదిగలకు గుర్తింపు లేకుండా పోయింది

పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అతిపెద్ద కులమైన మాదిగ సామజిక వర్గానికి రాజకీయంగా గుర్తింపు లేకుండా పోయిందని, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించి ఒక పార్లమెంట్ స్థానంతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాదిగ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం తమ సామాజిక వర్గానికి రెండు పార్లమెంట్ స్థానాలు వస్తాయనుకుంటే ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో మాదిగలకు గుర్తింపు లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్ఠానం పునరాలోచించుకోవాలని,తమ సామాజిక వర్గానికి న్యాయం చేసే బాధ్యత పార్టీపైనే ఉందన్నారు. కేసీఆర్ కన్నా ఎక్కువ రోజులు జైలులో ఉన్న తనకే కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికల టికెట్ ఇస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. తనకు కంటోన్మెంట్ ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రవి కిరణ్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, జోగు గణేష్, మీసాల మహేష్,జి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిడమర్తి రవి

నైపుణ్యమైన విద్యతో అభివృద్ధి

పంజాగుట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఏ రంగంలో నైనా రాణించగలరని గుజరాత్ రాజ్ కోట్‌లోని మార్వాడీ యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.బి జడేజా అన్నారు. మంగళవారం సోమాజిగూడలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని సీఎఫ్ఓ హార్దిక్ దుల్లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్లోబలైజేషన్ నేపథ్యంలో ప్రపంచమే కుగ్రామంగా మారుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో పాటు అత్యుత్తమ విద్య మన విద్యార్థులకు అవసరమని అన్నారు. దీని దృష్టిలో ఉంచుకొని వైద్య విద్యతో పాటు సాంకేతిక విద్య, సాధారణ డిగ్రీలను సైతం అందిస్తున్నామన్నారు. ఆసక్తిగల విద్యార్థులకు పూర్తి సహాయ సహకారాలు అందించేకు తెలంగాణలో మొదటిసారిగా అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.


అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్.బీ జడేజా

'అయ్యో'మయం!

(5వ పేజీ తరువాయి)

నగరంలో బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపింది. పార్టీ మారుతారంటూ నగరానికి చెందిన పలువురు గులాబీ శాసనసభ్యుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మేం బీఆర్ఎస్‌ను వీడేది లేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా..ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన పూర్వాశ్రమం కాంగ్రెస్‌లో తిరిగి చేరుతారని ప్రచారం జరుగతున్న వేళ.. నియోజకవర్గ హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర నిర్వహించడం గమనార్హం. ఈసమయంలో పార్టీ మారుతారని ప్రచారం జరగడంతో దీంతో పార్టీలో ఉంటారా? వెళ్తారా? అని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన వేళ ఇలాంటి పరిస్థితి ప్రభావం చూపుతుందని సీనియర్ నేతలు అభిప్రాయ పడుతున్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసు లు ఖైరతాబాద్, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధులలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మంగళవారం సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్ కు మార్ నేతృత్వంలో సీఐఎస్ఎ ఫ్ సిబ్బందితో పాటు రెండు పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈసందర్భం గా ఏసీపీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా ప్రజల్లో భద్రత విషయమై భరోసా కల్పిస్తూ సం ఘ వ్యతిరేక శక్తులు, చట్టాలను ఉల్లంఘించేవారికి హెచ్చరికలు జారీ చేసేందుకు ఈ కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున దానికి అనుగునంగా నడుచుకోవాలకు ప్రజలకు వివరించామన్నారు. 60 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు, ఖైరతాబాద్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, రాఘవేంద్ర, అదనపు ఇన్‌స్పెక్టర్లు విఘ్నేశ్వర్, నాగార్జున, ఎస్ఐలు, సిబ్బంది దాదాపు 100 మందికి పైగా పోలీసులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

14న బ్లూ షర్ట్స్-బ్లూ మార్చ్‌కి కమిటీ నియామకం

పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్ కార్యక్రమానికి కార్యనిర్వాహక కమిటీని మంగళవారం పిడమర్తి రవి ప్రకటించారు. కమిటీ కన్వీనర్‌గా అంబేడ్కర్ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రాములు,మహిళా కన్వీనర్‌గా కోటగిరి ఉషారాణి, సమన్వయకర్తలుగా తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ, మహా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ముత్యపాక నరసింహారావు, ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రహీం, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనాథ్, మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి జోగారావు, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్, తెలంగాణ దళిత దండు ఉపాధ్యక్షులు మొగులయ్యలు నియమితులయ్యారు.


మాట్లాడుతున్న దర్భనం శర్మ, గిరిప్రసాద్‌శర్మ

ధన్వంతరి ఫౌండేషన్ చైర్మన్ మోసాలపై సీఐడీతో విచారణ జరిపించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి ఫౌండేషన్ చైర్మన్ కమలాకర్‌శర్మ మోసాలపై సీఐడీతో విచారణ జరిపించాలని పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి బర్కత్‌పురలో దంతపల్లి చాంబర్స్‌లోని బ్రాహ్మణ హాల్‌లో కమలాకరశర్మ బాధితుల సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ భవన్ వ్యవస్థాపక సీఈవో గిరిప్రసాద్‌శర్మ, బ్రాహ్మణ సంఘాల నేతలు దర్భనం శర్మ, బసవరాజు శ్రీనివాసులు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకతో పాటు ఉత్తర భారతంలో ఉన్న బ్రాహ్మణుల నుంచి భూముల కొనుగోలుకు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కమలాకరశర్మ రూ. 350 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. భూములు కొనుగోలు చేసి వచ్చే డబ్బుతో అధిక వడ్డీ చెల్లిస్తామని నమ్మించడంతో దాదాపు 4 వేల మంది బ్రాహ్మణులు అతడి వద్ద డబ్బు ఇన్వెస్ట్ చేశారని అన్నారు. ప్రస్తుతం కమలాకరశర్మ వేరే కేసులో జైలులో ఉన్నారని, దానిని సాకుగా చూపించి డబ్బు ఎగ్గొట్టేందుకు చూస్తున్నాడని అన్నారు. డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేసిందే అదే తరహాలో కమలాకరశర్మ బాధితులకు కూడా న్యాయం చేయాలని కోరారు.

ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఏఆర్ కానిస్టేబుల్ వసూళ్లు

● ప్రభుత్వ ఉద్యోగులకు బెదిరింపులు
● అతడితో పాటు సహకరించిన మెకానిక్ అరెస్ట్

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌ను, అతనికి సహకరిస్తున్న ఓ టీవీ మెకానిక్‌ను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, చైతన్యపురి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్మన్‌ఘాట్, క్రాంతినగర్‌లో నివసించే ఎ.మల్లేశ్ అలియాస్ మూర్తి (38) మహబూబ్‌నగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. కొద్దికాలం క్రితం నాగర్‌కర్నూల్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. తనకు పరిచయస్తుడైన చింతలకుంటకు చెందిన టీవీ మెకానిక్ రాపోలు అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (28)తో కలిసి సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ అవతారమెత్తాడు. ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగుల వివరాలతో ఒక లిస్ట్ తయారు చేశాడు. వారిని టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. అనిల్ ఫోన్ ద్వారా వారిని బెదిరించేవాడు. పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ట్రెజరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొత్తపేటకు చెందిన కె.సుధీర్‌బాబుకు మార్చి 6న ఫోన్ చేశాడు. అవినీతికి పాల్పడుతున్నావంటూ ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయని బెదిరించాడు. దాడి చేయకుండా ఉండాలంటే లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీని గురించి మాట్లాడేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఏసీబీ కార్యాలయం రోడ్డు వద్దకు రావాలని సూచించాడు.

పోలీసులను ఆశ్రయించడంతో ఆటకట్టు!

తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తనను బెదిరిస్తున్న మల్లేష్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సుధీర్‌బాబు చైతన్యపురి పోలీసులను ఆశ్రయించాడు. కాల్‌డేటా ఆధారంగా అనిల్, మల్లేష్‌పై చైతన్యపురి పోలీసులు, ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఏఆర్ కానిస్టేబుల్ మల్లేష్ సూత్రధారిగా తేలింది. దీంతో పోలీసులు మంగళవారం కానిస్టేబుల్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిదిమంది వద్ద డబ్బు వసూలు

నిందితులు మల్లేష్, అనిల్‌ను విచారించగా గతంలో ఎనిమిదిమంది ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి సుమారు రూ.3.40 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తేలింది. వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప నుంచి రూ.లక్ష, డీఎస్పీ ఇమ్మానుయల్ నుంచి రూ.8 వేలు, ఆర్ఐ వీరేష్ నుంచి రూ.65 వేలు, ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య నుంచి రూ.5 వేలు, అనిల్, రామ్‌లాల్, సౌమిత్రి నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల వద్ద రెండు మొబైళ్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



భక్తులకు పసాదం అందజేస్తున్న జి.నివేదిత

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి : నివేదిత

మారేడుపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌మారేడుపల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. దివంగత నేత జి.సాయన్న కుమార్తె జి.నివేదిత పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు జి.నివేదిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నివేదితను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం భక్తులకు ఆమె స్వయంగా భోజనాలు వడ్డించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు చోలేటి రమేష్, నాగేందర్ యాదవ్, వేణుగోపాలచారి, ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్వరశర్మ, ఓం నమశ్శివాయ గ్రూప్ సభ్యులు శ్రీకాంత్, రాంబాబు, సురేష్, కృష్ణ, ఆనంద్, శ్రీనివాస్, భాస్కర్ ముదిరాజ్, మురళి యాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడలో సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను మంగళవారం చిలకలగూడ గాంధీ బొమ్మ వద్ద నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్ధంతి వేడుకల్లో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్నగౌడ్ చేసిన త్యాగాలు, సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బోర్‌వెల్ వాటర్ పైప్‌లైన్ పనులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రసూల్‌పురా నూర్జహాన్ గల్లీలో బోర్‌వెల్ వాటర్ పైప్‌లైన్ రెండు వారాల క్రితం దెబ్బతింది. దాంతో నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పైప్‌లైన్ బాగు చేయించాలని బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్‌కు స్థానికులు విజ్ఞప్తి చేశారు. దాంతో ఆయన స్పందించి, కంటోన్మెంట్ బోర్డు అధికారులతో మాట్లాడారు. ఫలితంగా బోర్డు సిబ్బంది మంగళవారం రంగంలోకి దిగి మరమ్మతు పనులు చేపట్టారు. వాహబ్, అజ్జు, భాస్కర్, ముబీన్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

'అయ్యో'మయం!

(5వ పేజీ తరువాయి)

నగరంలో బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపింది. పార్టీ మారుతారంటూ నగరానికి చెందిన పలువురు గులాబీ శాసనసభ్యుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మేం బీఆర్ఎస్‌ను వీడేది లేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా..ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన పూర్వాశ్రమం కాంగ్రెస్‌లో తిరిగి చేరుతారని ప్రచారం జరుగతున్న వేళ.. నియోజకవర్గ హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర నిర్వహించడం గమనార్హం. ఈ సమయంలో పార్టీ మారుతారని ప్రచారం జరగడంతో దీంతో పార్టీలో ఉంటారా ? వెళ్తారా ? అని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన వేళ ఇలాంటి పరిస్థితి ప్రభావం చూపుతుందని సీనియర్ నేతలు అభిప్రాయ పడుతున్నారు.



గ్యాస్ లీకై మంటలు.. బాలుడికి గాయాలు

జవహర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో బాలుడికి గాయాలయ్యాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని జ్యోతిరావుకాలనీలో మల్లేశం భార్యా కవిత ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన మల్లేశం కుమారుడు బన్నీ (7) లైట్ స్విచ్ వేశాడు. అప్పటికే ఇంట్లో గ్యాస్ లీకై ఉండటం వల్ల మంటలు చెలరేగి బాలుడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాలుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా...

టీడీపీకి అవకాశం కల్పించాలి

- **టీడీపీ నేతలు**

తిరుమలగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టీడీపీకి అవకాశం ఇవ్వాలని కంటోన్మెంట్ టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుమలగిరి విలేజ్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయని, అందులో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కూడా కూటమి అభ్యర్థిగా రంగంలో ఉంటే సునాయాసంగా కూటమి జెండా ఎగురవేయగలదని టీడీపీ నేతలు అభిప్రాయపడ్డారు. సీనియర్ టీడీపీ నేతలు, టీడీపీ



సమావేశంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీలో కొనసాగుతున్న నేతలు జే.నర్సింగ్, ఎం.మధుసూదన్‌రావు, డీ.ఆర్.శ్రీనివాస్, కె.ప్రతాప్, అనురాధ, బి.వెంకట్, చంద్రశేఖర్, డి.వై.సుదర్శన్, నర్సింగ్ గౌడ్, అశోక్‌యాదవ్, మహేందర్ యాదవ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్ బలంగా ఉందని, గతంలో టీడీపీకి కంచుకోటగా ఉంటూ నిలిచిందని మధుసూదన్ తెలిపారు. ఎస్సీ సెల్ నియోజకవర్గమైన కంటోన్మెంట్ బలమైన అభ్యర్థి కూడా ఉన్నారని కూటమి అభ్యర్థిగా టీడీపీ అవకాశం కల్పిస్తే ఖచ్చితంగా కంటోన్మెంట్ నియోజకవర్గంపై కూటమి జెండా ఎగురవేయగలదని వారందరూ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్ఠానానికి కూడా ఈ సందర్భంగా ఆయా నేతలకు లేఖలు ద్వారా విజ్ఞప్తి కూడా చేయిస్తామని వివరించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకండి

- **వ్యాపారులకు పోలీసుల సూచన**

అడ్డగుట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని మారేడుపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్సై మహేష్‌లు వారాంతపు సంత వ్యాపారస్తులకు సూచనలిచ్చారు. మంగళవారం రాత్రి 7గంటల సమయంలో తుకారాంగేట్‌లో జరుగుతున్న వారాంతపు సంతలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సంతను పెట్టుకోవాలని, రోడ్డుకు ఆనుకుని వ్యాపారం చేసుకుంటే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని పదే పదే గతంలో అనేకసార్లు వ్యాపారులకు సూచించామన్నారు. సాయంత్రం నుంచి మధ్యరాత్రి వరకు సాగుతున్న వారాంతపు సంతలో ప్రధాన రోడ్డు మార్గంలో ఈవైపునా రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు ఆర్టీసీ బస్సులు, వాహనాదారులు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



వారాంతపు సంతంలో సూచనలు ఇస్తున్న మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్సై మహేష్

తాము సూచించిన ఆదేశాలను పాటిస్తే ఎవరికీ నష్టం జరుగదని, వ్యాపారం చేసుకోవద్దని తాము చెప్పడంలేదని ట్రాఫిక్ పోలీసుల నిబంధనలు పాటించి ప్రజలకు సహకారం అందించాల్సిన బాధ్యత వారాంతపు సంత వ్యాపారస్థులకు ఉందన్నారు. రోడ్లపైనే వారాంతపు సంతను నడుపుకుంటున్న కొంత మందికి రూ.100 చలాన్ వేశామని, మరోసారి జరుగకుండా వారాంతపు సంత వ్యాపారస్తులు జాగ్రత్తపడేందుకు చలాన్లు రాస్తున్నామని ఆయన చెప్పారు. రోడ్లపైకి కూరగాయల బండ్లు బయటికి రాకుండా వ్యాపారం చేసుకోవాలని ఎస్సై మహేష్ వ్యాపారస్థులకు సూచనలిచ్చారు. మీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మీరే చూసుకోవాలంటూ సూచనలు ఇచ్చారు.



చలానా రాసిన ట్రాఫిక్ పోలీసులు



కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులతో సమావేశం అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దానం నాగేందర్ తదితరులు

ఆర్ అండ్ డీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఉమ

ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ శ్రీకాంత్‌కు బాధ్యతలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో ఆర్ అండ్ డీ డైరెక్టర్‌గా బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. అద్దేపల్లి ఉమకు, ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ తిరుమల శ్రీకాంత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు ఇటీవల పదవీ విరమణ చేసిన నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు ఈ నియామకాలను చేపట్టారు. ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ ఉమ ప్రస్తుతం అదే విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా అదనపు బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శ్రీకాంత్ పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్‌గా వ్యవహరిస్తున్నారు. అర్హత కలిగిన సీనియర్ ఆచార్యులు ఎంతోమంది అందుబాట్లో ఉన్నప్పటికీ కీలకమైన విభాగాలకు ఇన్‌చార్జీలుగా ఉన్నతాధికారులు నియమించడాన్ని యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ఆక్షేపిస్తున్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులను వీలైనంత త్వరగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.



డాక్టర్ ఉమ



జీకే కాలనీలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మహ్మద్‌అలీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే సీఏఏకు వ్యతిరేకం

- **ముస్లింల సహకారంతో గ్రేటర్‌లో మంచి ఫలితాలను సాధించాం**

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే సీఏఏకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకమని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం సాయంత్రం జీకే కాలనీలోని సరస్వతి ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ముస్లింలకు అండగా ఉంటుందన్నారు. పదేళ్ల ప్రభుత్వానికి అండగా ముస్లింలు నిలిచారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింల సహకారంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. బీఆర్ఎస్ పార్టీ లౌకిక రాజ్యానికి అనుగుణంగా నడుచుకొంటుందన్నారు. ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహ్మద్‌అలీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు మీనాఉపేందర్‌రెడ్డి, సునీతాయాదవ్, సబితాఅనిల్‌కిషోర్, మాజీ ఎంటీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉపేందర్‌రెడ్డి, జీకే హనుమంతరావు, అంజయ్య, రాముయాదవ్, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఏఆర్ కానిస్టేబుల్ వసూళ్లు

- **ప్రభుత్వ ఉద్యోగులకు బెదిరింపులు**

అతడితో పాటు సహకరించిన మెకానిక్ అరెస్ట్

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌ను, అతనికి సహకరిస్తున్న ఓ టీవీ మెకానిక్‌ను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, చైతన్యపురి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్మన్‌ఘాట్, క్రాంతినగర్‌లో నివసించే ఎం.మల్లేశ్ అలియాస్ మూర్తి (38) మహబూబ్‌నగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. కొద్దికాలం క్రితం నాగర్‌కర్నూల్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. తనకు పరిచయస్తుడైన చింతలకుంటకు చెందిన టీవీ మెకానిక్ రాపోలు అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (28)తో కలిసి సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ అవతారమెత్తాడు. ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగుల వివరాలతో ఒక లిస్ట్ తయారు చేశాడు. వారిని టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. అనిల్ ఫోన్ ద్వారా వారిని బెదిరించేవాడు. పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ట్రెజరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొత్తపేటకు చెందిన కె.సుధీర్‌బాబుకు మార్చి 6న ఫోన్ చేశాడు. అవినీతికి పాల్పడుతున్నావంటూ ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయని బెదిరించాడు. దాడి చేయకుండా ఉండాలంటే లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీని గురించి మాట్లాడేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఏసీబీ కార్యాలయం రోడ్డు వద్దకు రావాలని సూచించాడు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

పోలీసులను ఆశ్రయించడంతో ఆటకట్టు..!

తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తనను బెదిరిస్తున్న మల్లేష్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సుధీర్‌బాబు చైతన్యపురి పోలీసులను ఆశ్రయించాడు. కాల్‌డేటా ఆధారంగా అనిల్, మల్లేష్‌పై చైతన్యపురి పోలీసులు, ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఏఆర్ కానిస్టేబుల్ మల్లేష్ సూత్రధారిగా తేలింది. దీంతో పోలీసులు మంగళవారం కానిస్టేబుల్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిది మంది వద్ద డబ్బు వసూలు..

నిందితులు మల్లేష్, అనిల్‌ను విచారించగా గతంలో ఎనిమిదిమంది ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి సుమారు రూ.3.40లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తేలింది. వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప నుంచి రూ.లక్ష, డీఎస్పీ ఇమ్మానుయల్ నుంచి రూ.8వేలు, ఆర్ఐ వీరేష్ నుంచి రూ.65వేలు, ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య నుంచి రూ.5వేలు, అనిల్, రామ్‌లాల్, సౌమిత్రి నుంచి రూ.5వేలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల వద్ద రెండు మొబైళ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అవమానాన్ని సహించేది లేదు

- **కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో 300 నామినేషన్లు వేస్తాం**
- **శ్రీకిషన్ మాదిగ**

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆకలైనా భరిస్తాం కాని అవమానాన్ని సహించేదిలేదు అని మాదిగలకు టికెట్ కేటాయించకపోతే 300 మంది మాదిగ నాయకులు రానున్న కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో నామినేషన్లు వేస్తామని కంటోన్మెంట్ మాదిగ సంఘాల సమక్షంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ ప్రధాన పార్టీలను హెచ్చరించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంకు ఉపఎన్నిక జరుగనుంది. ఈనేపథ్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో మాదిగల సంఖ్య బలం ఎక్కువగా ఉండడంతో ఈసారి టికెట్ మాదిగలకు కేటాయించాలని గత కొన్నిరోజులుగా కంటోన్మెంట్‌లోని అన్ని మాదిగ సంఘాలు ఏకమై అన్ని ప్రధాన పార్టీలకు వినతిపత్రాలను అందజేయడమే కాకుండా నిరసనలు చేస్తూ మాదిగ సామాజికవర్గం ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం 11గంటలకు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి విఅండ్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో మాదిగల సింహగర్జన సభను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మాదిగల సింహగర్జన వాల్‌పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకిషన్, గోపి మాదిగ, అజిత్ కళ్యాణ్, బట్టుశంకర్ మాదిగ, విజయరామరాజు మాదిగ, సునీల్‌లు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని ప్రధాన పార్టీలు మాదిగలకు టికెట్ కేటాయించాలని, లేనిపక్షంలో ప్రతి మాదిగబిడ్డ డప్పు కొట్టుకుంటూవెళ్లి 300 మంది నామినేషన్‌లు వేసి మాదిగలకు టికెట్ కేటాయించని పార్టీలను చిత్తు చిత్తుగా ఓడిస్తామని, అంతేకాకుండా ఆయా పార్టీలను అడ్డుకుంటూ తరిమి కొడతామని హెచ్చరించారు. కావున ఈ కంటోన్మెంట్ సింహగర్జన సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గంధం దయామణి, రాములు మాదిగ, ఉత్తరయ్య, రొట్టేల సునీల్, శంకర్, రాకేష్, రాజేందర్, మహేందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ మాదిగల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాదిగ సంఘాల నాయకులు



నూతనంగా ఎన్నికైన నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బౌద్ధనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. చిలకలగూడ నాగులూరి జీహెచ్‌ఎంసీ పార్కు ప్రాంగణంలో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ ప్రతినిధులు బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ చైర్మన్‌గా నాగులూరి సాయిబాబా, వైస్‌చైర్మన్ నర్సింహారావు, అధ్యక్షుడు గిరిధరబాబు, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణశర్మ, ప్రధాన కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ డీకే సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రమోద్‌కుమార్, కోశాధికారి ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కొండ్రేటి శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, రవిశంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా మాట్లాడుతూ నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చిలకలగూడ జీహెచ్‌ఎంసీ పార్కును దత్తత తీసుకుని నిర్వాహణ బాధ్యతలు స్వీకరించి కొనసాగిస్తున్నామని, జంటనగరాల్లో పార్కుల నిర్వహణ పోటీల్లో పలు అంశాల్లో అవార్డులు గెలుచుకున్నామని తెలిపారు. నాగులూరి నర్సింహ జీహెచ్‌ఎంసీ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్కువాకర్లు, యోగా అభ్యాసకులు, క్రీడాకారులు స్థానికులు తమవంతు సహాయ సహకారాలందించాలని కోరారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులను అభినందించారు.

ఏడాది కాలంలో 416 కి.మీ.ల రైల్వేట్రాక్ నిర్మాణం

రికార్డు స్థాయిలో నెట్‌వర్క్ విస్తరణ పనులు : దక్షిణమధ్య రైల్వే

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే పరిధిలో గత ఆర్థిక సంవత్సరం 2023-24లో రికార్డు స్థాయిలో 416కి.మీ మేర నూతనంగా రైల్వే లైన్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తిచేశారు. జోన్ పరిధిలో అదనంగా రైల్వే ట్రాక్ పనులు పూర్తిచేయడం ద్వారా ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే రైళ్ల రాకపోకలు మరింత సులభతరమవుతాయని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలో 39కి.మీ.ల మేర నూతన రైల్వే లైన్‌ల నిర్మాణంతో పాటు 54 కి.మీ.ల మేర గేజ్ మార్పిడి జరిగింది. అలాగే 133కి.మీ.ల మేర రెండవ రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పాటు మరో 190.కి.మీ.ల మేర మూడవ రైల్వే లైన్ పనులను విజయవంతంగా పూర్తిచేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ కేంద్రీకృత విధానంవల్ల గత ఏడాది సమిష్టి కృషితో జోన్‌లో గతంలో ఎప్పుడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ట్రాక్ విస్తరణ పనులు పూర్తి 416 కి.మీ సరికొత్త ట్రాక్ నెట్‌వర్క్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించుకోవడంతోపాటు వాటి అమలుపై నిరంతర శ్రద్ధ తీసుకోవడంతో నూతన రైలు మార్గాలను సమయానుకూలంగా ప్రారంభించుకున్నట్టు వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో మనోహరాబాద్-కొత్తపల్లి కొత్తలైన్ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణలో దుద్దెడ-సిద్దిపేట మధ్య 11కి.మీ, ఆంధ్రప్రదేశ్‌లోని నడికుడి-శ్రీకాళహస్తి ప్రాజెక్టులో భాగంగా గుండ్లకమ్మ- దర్శి మధ్య 28 కిలోమీటర్ల మేర మొత్తంగా 39కి.మీ కొత్త లైన్‌లు పూర్తిచేసినట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. అలాగే గేజ్ మార్పిడి ప్రాజెక్టులో భాగంగా అకోలా- ఖాండ్వా ప్రాజెక్టులో అంతర్భాగంగా మధ్యప్రదేశ్‌లోని అమ్లాఖుర్ద్-ఖాండ్వా మధ్య కీలకమైన 54 కిలోమీటర్ల విస్తీర్ణం పూర్తిచేసినట్టు పేర్కొన్నారు. ఇక విజయవాడ బైపాస్ లైన్‌కు 5కిమీ, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ విద్యుదీకరణ ప్రాజెక్టులో భాగంగా వివిధ విభాగాలలో 107కిమీ, ఎమ్.ఎమ్.టి.ఎస్. రెండవ దశ ప్రాజెక్టులో భాగంగా సనత్‌నగర్-మౌలాలీల మధ్య మరో 21 కి.మీలతో కలిపి మొత్తం 133కిమీ డబ్లింగ్ వర్క్ పూర్తిచేసినట్టు తెలియజేశారు. ఇంతేకాకుండా జోన్‌లో గత ఏడాది కాలంలో 170 కి.మీ మేర మూడవ రైల్వే లైన్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తిచేసినట్టు అధికారులుపేర్కొన్నారు. తెలంగాణలోని కాజీపేట-విజయవాడ మధ్య విద్యుద్దీకరణతోపాటు మూడవ లైన్ ప్రాజెక్టులోని వివిధ విభాగాలలో 53కిమీ, మహారాష్ట్రలోని కాజీపేట-బల్లార్షా మధ్య విద్యుద్దీకరణతోపాటు మూడవ లైన్ ప్రాజెక్టులో వివిధ విభాగాలలో 60కిమీ, విజయవాడ-గూడూరు మధ్య విద్యుద్దీకరణతో పాటు మూడవ లైన్ ప్రాజెక్టులో వివిధ విభాగాలలో 77కి.మీ పూర్తి చేసినట్టు తెలిపారు.

జోరుగా హలీం విక్రయాలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఎప్పుడు వస్తుందా.. హలీమ్ ఎప్పుడు తిందామా అని చూస్తుంటారు హలీమ్ ప్రియులు. నెల రోజుల్లో పదిసార్లైనా హలీమ్‌ను లాగిస్తుంటారు. రంజాన్ వచ్చిందంటే ముందుగా గుర్తుకు వచ్చేది హలీమ్. ఒక్కసారైనా హలీం తినాలని ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ఒక్క ముస్లిం సోదరులే కాకుండా అన్నివర్గాలవారు ఈ హలీమ్‌ను ఇష్టంగా తింటూ ఉంటారు. రంజాన్ మాసంలో కనిపించే హలీం సంవత్సరంలో శుభాకార్యాలు, ఇతర కార్యాలకు ప్రత్యేక డిష్‌గా పెడుతున్నారు. ఇరాన్‌లు చేసే హలీంకు రెండువందల సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో నవాబుల ఇళ్లల్లో ఇరానీ వంటకాలతో పాటు హలీంను చేసేవారు. రాను రాను హలీంకు ప్రత్యేక డిష్‌గా మార్కెట్‌లోకి వచ్చింది. ప్రపంచస్థాయిలో హైదరాబాద్ హలీంకు గుర్తింపు వచ్చిందంటే ఇక్కడ తయారుచేసే హలీం ఎంత రుచిగా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు.



మైలార్‌గడ్డలో ఎవర్‌గ్రీన్ హోటల్ వద్ద హలీమ్ విక్రయాలు

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భవతి కిడ్నీలు ఫెయిల్

సంతోష్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఈదిబజార్‌కు చెందిన ఓ గర్భవతి (23) డెలివరీ కోసం స్థానిక కుమ్మరివాడిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. రక్తం తక్కువగా ఉండటంతో డాక్టర్ సరళ తెల్ల రక్తకణాలు ఎక్కించినట్లు ఆమె భర్త ఇమ్రాన్ తెలిపారు. కొద్దిసేపటి తర్వాత తన భార్య ఆరోగ్యం క్షీణించిందని, మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి డయాలసిస్ చేయించాలని వైద్యులు తెలిపారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని ఆరోపిస్తూ ఇమ్రాన్ సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధన్వంతరి ఫౌండేషన్ చైర్మన్ మోసాలపై సీఐడీతో విచారణ జరిపించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి ఫౌండేషన్ చైర్మన్ కమలాకర్‌శర్మ మోసాలపై సీఐడీతో విచారణ జరిపించాలని పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి బర్కత్‌పురలో దంతపల్లి చాంబర్స్‌లోని బ్రాహ్మణ హాల్‌లో కమలాకరశర్మ బాధితుల సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ భవన్ వ్యవస్థాపక సీఈవో గిరి ప్రసాద్‌శర్మ, బ్రాహ్మణ సంఘాల నేతలు దర్శనం శర్మ, బసవరాజు శ్రీనివాసులు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకతోపాటు ఉత్తర భారతంలో ఉన్న బ్రాహ్మణుల నుంచి భూముల కొనుగోలుకు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కమలాకరశర్మ రూ. 350 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. భూములు కొనుగోలు చేసి వచ్చే డబ్బుతో అధిక వడ్డీ చెల్లిస్తామని నమ్మించడంతో దాదాపు 4 వేల మంది బ్రాహ్మణులు అతడి వద్ద డబ్బు ఇన్వెస్ట్ చేశారని అన్నారు. ప్రస్తుతం కమలాకరశర్మ వేరే కేసులో జైలులో ఉన్నారని, దానిని సాకుగా చూపించి డబ్బు ఎగ్గొట్టేందుకు చూస్తున్నాడని అన్నారు. డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేసిందే ఆదే తరహాలో కమలాకరశర్మ బాధితులకు కూడా న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న దర్శనం శర్మ, గిరిప్రసాద్‌శర్మ

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364